ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శనివారం 11 అక్టోబరు 2025

పొగాకు వినియోగం ప్రమాదకరం

- గుట్కా, సిగరేట్‌కు దూరంగా ఉండాలి
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రవిరాథోడ్



సమావేశంలో మాట్లాడుతున్న భూక్య రవిరాథోడ్

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొగాకు వినియోగం మానవమనుగడకు అత్యంత ప్రమాదకరమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రవిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం జాతీయ యోజన పొగాకు రహిత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువత, మధ్య వయస్సు, వృద్ధులు పొగాకు బానిసై వివిధ రోగాల బారినపడి మృత్యువాత పడుతున్నట్లు గుర్తు చేశారు. ఏటా 13.5 లక్షల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. పొగాకు వినియోగం వల్ల చిన్న వయస్సులోనే రోగాల బారినపడి మృతి చెందుతున్నట్లు తెలిపారు. యువత పొగాకుతో సంబంధమున్న సిగరేటు, అంబరు, గుట్కా లాంటి వాడకాన్ని నిరోధించుకోవాలన్నారు. పొగాకు నియంత్రణకు విద్యాసంస్థలు, గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చాలన్నారు. అనంతరం పొగాకు నియంత్రణకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి

(మిగతా 8లో..)

మధ్యవర్తిత్వ క్యాంపెయిన్ విజయవంతం

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రఫీ



మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు దేశ వ్యాప్తంగా నిర్వహించిన 90 రోజుల మిడియేషన్ క్యాంపెయిన్ మహబూబాబాద్ జిల్లాలో విజయవంతమైనట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ శుక్రవారం మానుకోటలో తెలిపారు. జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో మొత్తం 56 కేసులను మధ్యవర్తిత్వానికి నివేదించగా అందులో 14 కేసులు ఇరుపక్షాల రాజీతో పరిష్కారమయ్యాయని తెలిపారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం కూడా ఒక ప్రత్యామ్నాయ వేదిక అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన న్యాయవాదులు చిన్న మల్లారెడ్డి, కృష్ణ, మహేందర్, సుభాష్, హరికృష్ణ, రఘునాథరావు, సైదులు, శ్రీనివాసులు మధ్యవర్తిత్వం కేంద్రం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. 90 రోజుల క్యాంపెయిన్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనల ప్రకారం టపాసుల దుకాణాలు నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్

8

సారథులెవరో!?

కాంగ్రెస్ జిల్లా కార్యవర్గాల భర్తీకి అధిష్ఠానం కసరత్తు



అధికార కాంగ్రెస్‌లో సంస్థాగత సందడి మొదలైంది. జిల్లా కమిటీల కార్యవర్గాలను ఎంపిక చేసేందుకు టీపీసీసీ కసరత్తు చేస్తోంది. డీసీసీ అధ్యక్ష పదవికి పోటీ పడే వారి నుంచి శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడటంతో పార్టీ సంస్థాగత ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని అధిష్ఠానం భావిస్తోంది. అయితే పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో పార్టీ పదవులపై నాయకులు ఆశతో ఉన్నారు. ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలకే డీసీసీ అధ్యక్ష పదవిని కట్టబెట్టేందుకు అధిష్ఠానం సుముఖంగా ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఉన్న డీసీసీ అధ్యక్షుల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మరో టర్మ్ కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లుగా ప్రచారం ఉంది. మిగతా జిల్లాల్లో కూడా పాత, కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. పార్టీ పదవుల పందేరం ఇప్పుడు కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

- నేటి నుంచి డీసీసీ అధ్యక్ష పదవులకు దరఖాస్తుల స్వీకరణ
- హనుమకొండకు ఎమ్మెల్యే నాయిని వైపే అధిష్ఠానం మొగ్గు..?
- వరంగల్ డీసీసీకి స్వర్ణతో పాటు మరో నలుగురైదుగురు ఆశావహులు
- జనగామ జిల్లా అధ్యక్ష రేసులో ఝాన్సీరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి
- ములుగు జిల్లా అధ్యక్ష పదవి తెరపైకి పైడాకుల, సూర్య
- భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష పీఠం దక్కేదెవరికో?
- ఎమ్మెల్యేలు, సీనియర్లకు అవకాశం ఇవ్వాలనే యోచనలో అధిష్ఠానం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులను భర్తీ చేసేందుకు అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. శనివారం నుంచి వారంపాటు జిల్లా అధ్యక్ష పదవిని ఆశించే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఏఐసీసీ నుంచి ప్రతీ జిల్లాకు డీసీసీ ఎన్నికల పర్యవేక్షులను నియమించారు. శనివారం హనుమకొండ, వరంగల్ జిల్లా పార్టీ సమావేశాలను డీసీసీ భవన్‌లో నిర్వహిస్తున్నారు. సోమవారం భూపాలపల్లి పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్ష పదవిని ఆశించేవారు తమ దరఖాస్తుతో పాటు పార్టీ వారు చేసిన సేవలు, అనుభవం, గతంలో నిర్వహించిన బాధ్యతలు, తదితర వివరాలతో స్పష్టంగా పేర్కొంటూ ఏసీసీఐ పర్యవేక్షకులకు ఇవ్వాలని అధిష్ఠానం సూచించింది. దీంతో డీసీసీ అధ్యక్ష పదవిని ఆశించే నేతలు దరఖాస్తులు సిద్ధం చేసుకుంటున్నారు.

హనుమకొండ నాయినికేనా..

ఉమ్మడి జిల్లాకు కేంద్రంగా ఉన్న హనుమకొండ డీసీసీ అధ్యక్ష పదవి కాంగ్రెస్‌కు కీలకంగా మారింది. ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు హనుమకొండలో కీలకమైన నేత చేతిలో డీసీసీ పగ్గాలు ఉంచాలని అధిష్ఠానం భావిస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డికి ఇటీవలే టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా పార్టీ నియమించింది. అయితే తనకు కార్యనిర్వాహక అధ్యక్ష పదవి కావాలని నాయిని అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారు. కులాల సమీకరణలో నాయిని ఉపాధ్యక్ష పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే డీసీసీ అధ్యక్ష పదవిని వేరే వాళ్లకు అప్పగించాలని నాయిని పీసీసీ అధ్యక్షుడికి లేఖ కూడా రాశారు. దీంతో హనుమకొండ డీసీసీ అధ్యక్ష పదవిపై కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జంగా రాఘవరెడ్డి, దొమ్మాటి సాంబయ్యతో పాటు మరో నలుగురైదుగురు నజర్ వేసినట్లుగా ప్రచారం జరిగింది. అయితే అధిష్ఠానం మరోసారి డీసీసీ అధ్యక్ష పదవిని నాయిని రాజేందర్ రెడ్డికి అప్పగించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాలకు బలంగా కౌంటర్ ఇస్తుండటంతో పాటు రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉండటంతో నాయిని వైపే అధిష్ఠానం మొగ్గు చూపుతోందనే ప్రచారం జరుగుతోంది. జడ్పీ చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వుడు కావటంతో దొమ్మాటి సాంబయ్య కూతురు మౌనికకు దాదాపు ఖరారైందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో నాయిని అధ్యక్ష పదవి చేపట్టేందుకు అయిష్టత చూపిస్తే రెడ్డి సామాజిక వర్గం నుంచి మరొకరికి అవకాశం ఇస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఇక వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవిని మరోసారి చేపట్టేందుకు ఎర్రబెల్లి స్వర్ణ సుముఖంగా ఉన్నారనే ప్రచారం ఉంది. అయితే వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖతో పాటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి.. తమ అనుచరులను బరిలోకి దించేందుకు ప్రణాళిక రూపొందించారని తెలుస్తోంది. మంత్రి కొండా దంపతులు తమ అనుచరులు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాష్‌తో పాటు మరో ఇద్దరు ముగ్గురు పేర్లను అధిష్ఠానం



(మిగతా 7లో..)

'పరిశ్రమల' విప్లవం

కేసముద్రంలో నిర్మాణం ప్రారంభించిన ఓ రైస్ మిల్లు



కేసముద్రం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : ధాన్యం ప్రధాన ముడిసరుకుగా కొనసాగే అనుబంధ మిల్లుల ఏర్పాటు శరవేగంగా కొనసాగుతూ జిల్లాలో పారిశ్రామిక విప్లవంలాగా రైస్ ఇండస్ట్రీలు ఆవిర్భవిస్తున్నాయి. గత రెండేళ్ల నుంచి మిల్లుల ఏర్పాటు పెరగగా, ఈ ఏడాది ఒకేసారి పదుల సంఖ్యలో రైస్ మిల్లులు నెలకొల్పుతుండడం గమనార్హం. మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటికే 107 ధాన్యం మిల్లులు ఉండగా, నూతనంగా 30కిపైగా ఏర్పాటవుతున్నట్లు సమాచారం. ఇందులో కేసముద్రం మండలంలోనే పదికిపైగా కొత్తవి, అప్‌గ్రేడ్ కోసం దరఖాస్తు చేసినవి ఉండగా, నూతనంగా ఏడు మిల్లుల నిర్మాణాన్ని ప్రారంభించారు. జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరి 2,03,909 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, ఈ సారి 2,11,556 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత రబీలో 1,37,485 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ వానాకాలంలో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా. ఇంత భారీ మొత్తంలో ఉత్పత్తి అవుతున్న ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు రైస్ మిల్లుల ఆవశ్యకత ఎంతో ఉంది. ప్రభుత్వ సీఎంఆర్ విధానంలో ధాన్యం మర ఆడించే గిరాకీ వస్తుందనే ఆశలతోనే ఈ మిల్లులను విరివిగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో సూర్యాపేటలాగా కేసముద్రం కూడా రైస్ మిల్లులకు అడ్డాగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సీఎంఆర్ అంటే..?

రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల్లో ఖరీదు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లులకు పంపిస్తుంది. ఈ ధాన్యాన్ని మిల్లరు మర ఆడించి క్వింటా ధాన్యానికి బాయిల్డ్ మిల్లు అయితే 68 కిలోల బియ్యం, రా రైస్ మిల్లు అయితే 67 కిలోల బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి ఇవ్వాలి. దీన్నే కస్టం రైస్ మిల్లింగ్ (సీఎంఆర్) విధానం అని పిలుస్తారు. ఇలా ధాన్యం మర ఆడించినందుకు బియ్యం ఉత్పత్తిలో వెలువడే తౌడు, నూకలు, పరం, ఊకను మిల్లరే తీసుకోవాలి. అంతేకాకుండా మిల్లరుకు క్వింటాకు రూ.40ల చొప్పున ప్రభుత్వం మిల్లింగ్ చార్జీలను చెల్లిస్తుంది.

- కొత్త ధాన్యం మిల్లుల హవా
- జిల్లాలో 17 నూతన రైస్ ఇండస్ట్రీస్‌ల నిర్మాణం
- ఒక్క కేసముద్రం మండలంలోనే ఏడు ఏర్పాటు
- ఇప్పటికే 107 మిల్లులు, 'సీఎంఆర్'లో 75 పరిశ్రమలు
- ప్రభుత్వ ధాన్యంపైనే ఆధారం

పెరుగుట.. విరుగుట కొరకేనా..?

సీఎంఆర్ విధానంలో అనేక సమస్యలు ఉండడంతో నూతన మిల్లులు విజయవంతమవుతాయా! అనేది ఈ రంగంలో ఉన్న పలువురు వ్యాపారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నూతన మిల్లులను రూ.2 కోట్ల నుంచి రూ.4 కోట్ల చొప్పున బ్యాంకు రుణాలతోనే నెలకొల్పుతున్నారు. ఈ రుణాలకు నెలకు ఈఎంఐలు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంటోంది. సీఎంఆర్ విధానంలో గత ప్రభుత్వ హయాంలో క్వింటాకు రూ.30లు ఉండగా ఈ ప్రభుత్వం రూ.40 లకు పెంచింది. అయితే ఈ డబ్బులు గత పదేళ్లలో ఏనాడూ రాలేదని పలువురు మిల్లర్లు చెబుతున్నారు. సీఎంఆర్ విధానంలో గతంలో మాదిరిగా కాకుండా సమయం ఇవ్వకుండా అధికారులు వెంటవెంటనే బియ్యం అడుగుతున్నారు. ధాన్యం మర ఆడిస్తే క్వింటాకు 67 కిలోలు కాకుండా 55 నుంచి 60కిలోలే వస్తున్నాయని, తౌడు, నూకలు, పరం, ఊకను విక్రయించి మరి కొంత బియ్యాన్ని కలుపుకొని 67 కిలోల చొప్పున బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి ఇస్తున్నట్లు ఓ మిల్లరు తెలిపారు. ఇదిలా ఉండగా సీఎంఆర్ ధాన్యం మిల్లులకు ఇచ్చేందుకు ఈ సారి బ్యాంకు గ్యారెంటీ (బీజీ) నిబంధనలను ప్రభుత్వం కఠినంగా అమలు చేస్తోంది. గతంలో ఇచ్చిన సీఎంఆర్ రికార్డు ఆధారంగా 10 నుంచి 25 శాతం ధాన్యం విలువకు బ్యాంకు గ్యారెంటీ ఇస్తేనే సీఎంఆర్‌లో ధాన్యాన్ని కేటాయింపులు ఉంటాయి. ఇన్ని ప్రతీకూల అంశాల నేపథ్యంలో నూతన రైస్ మిల్లులు విజయవంతమవుతాయా! లేదా? అనేది వేచి చూడాలి.

ప్రభుత్వ కొనుగోళ్లపైనే ఆశలు..

కొత్తమిల్లులన్నీ ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లలోని సీఎంఆర్ విధానంపైనే ఆశలు పెట్టుకొని ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 107 రైస్ మిల్లులు ఉండగా.. 11 బాయిల్డ్, 64 బియ్యం మిల్లులు సీఎంఆర్ విధానంలో కొనసాగుతున్నాయి. ఈ మిల్లులకు గత వానాకాలంలో 1.57 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ఇవ్వగా, దాదాపు బియ్యం సేకరణ పూర్తయింది. రబీ సీజన్‌లో ఇచ్చిన ధాన్యంలో ఇప్పటికే 55 శాతం బియ్యాన్ని మిల్లులు తిరిగి ప్రభుత్వానికి ఇచ్చాయి. ఇదిలా ఉండగా జిల్లాలో చాలా మంది మిల్లర్లు నిబంధనల ప్రకారం వ్యవహరిస్తూ తమకు కేటాయించిన ధాన్యానికి బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి నిర్దేశించిన సమయంలోనే ఇస్తుండగా కొంతమంది మిల్లర్లు అవకతవకలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని అమ్ముకొని వచ్చిన డబ్బులను రియల్ ఎస్టేట్, ఇతర రంగాల్లో పెట్టుబడులు, తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ప్రభుత్వం నెలల తరబడి సమయం ఇస్తుండడంతో ఆ డబ్బులతో వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల నుంచి సీఎంఆర్ బియ్యంపై ఒత్తిడి వచ్చిన సమయంలో బయటి నుంచి బియ్యం కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఇచ్చిన సందర్భాలు లేకపోలేదు. ఇలా అనతికాలంలో భారీ మొత్తంలో పలువురు మిల్లర్లు ఆర్జించినట్లు ప్రచారమవుతోంది. సకాలంలో బియ్యం ఇవ్వని మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టడం, జరిమానాలు విధిస్తున్నారు.



కేసముద్రంలో ఒకేచోట ఏర్పాటైన మూడు రైస్ మిల్లులు

డోర్నకల్‌లో డీఆర్ఎం పర్యటన

డోర్నకల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణన్ శుక్రవారం డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో పర్యటించారు. ప్రత్యేక రైలులో మధ్యాహ్నం వచ్చిన డీఆర్ఎంకు డీఆర్‌యూసీసీ సభ్యులు ఖాదర్, లచ్చిరాం, రైల్వే సిబ్బందితో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇటీవల మరమ్మతులు పూర్తి చేసుకున్న రైల్వే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పీసీఎండీ డాక్టర్ నిర్మల రాజారాంతో


(మిగతా 8లో..)



డోర్నకల్‌లో రైల్వే ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన గదులను ప్రారంభిస్తున్న సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణన్

శీతాకాలంలో ఎండాకాలం

- ఐదు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- ఎండ వేడిమితో ఉక్కిరి బిక్కిరవుతున్న జనం



మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : శీతాకాలంలో ఎండాకాలం కనిపిస్తోంది. గత నాలుగైదు రోజుల నుంచి పెరిగిన ఉష్ణోగ్రతలతో ఎండ తీవ్రత పెరిగి, వేసవి కాలాన్ని తలపిస్తోంది. దీంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. మిట్ట మధ్యా హ్నం వేళలో భానుడు తన ప్రతాపం చూపడంతో బయటకు వెళ్లాలం టే జనం జంకుతున్నారు. వేసవి కాలం తరహాలో కొబ్బరి నీళ్లు, శీతల పానీయాల వినియోగం విపరీతంగా పెరిగింది. అక్కడక్కడ అడపదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎండ తీవ్రత, ఉక్కపోత మాత్రం తగ్గడం లేదు. సూర్యుడి ప్రతాపంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్, మే నెలల తరహాలో అక్టోబరు మాసంలో ఉక్కపోత పోయడంతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. వేసవి కాలం లాగానే ఉదయాన్నే పనులు ముగించుకుని ఇళ్లలోకి వెళ్లినప్పటికి ఫ్యాను గాలి సరిపోక చలి కాలంలో సైతం ఏసీలను వాడుతున్న పరిస్థితి నెలకొంది. అంటే వాతావరణంలో మార్పులు ఎలా సంభవిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. మధ్యాహ్నం వేళల్లో జనం లేక అక్కడక్కడ రోడ్లు నిర్మానుషం గా కన్పిస్తున్నాయి. కాలాలతో సంబంధం లేకుండా ఎండలు కొట్టడం, వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఐదు రోజులుగా 34 డిగ్రీలపైగానే ఉష్ణోగ్రతలు..

మానుకోట జిల్లాలో గత ఐదు రోజులుగా 34 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతూ వస్తున్నాయి. ఈ నెల 6న అత్యల్పంగా 22.6 డిగ్రీలు, అత్యధికంగా 34.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈనెల 7న అత్యల్పం 22.3, అత్యధికం 34.2, ఈనెల 8న అత్యల్పం 23.0, అత్యధికం 34.2, ఈ నెల 9న అత్యలంగా 22.9, అత్యధికంగా 34.9, తాజాగా శుక్రవారం రోజున అత్యల్పంగా 22.1, అత్యధికంగా 34.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఐటీఐలో ప్రవేశాలకు 17 లోగా దరఖాస్తు చేసుకోవాలి

- కళాశాల ప్రిన్సిపాల్ బాబు

8

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పాత బజారులోని పలుకాలనీల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్తిగార్డెన్, వ్యవసాయ మార్కెట్, మునిసిపాలిటీ ఏరియా, ఫారెస్ట్ సెంటర్, భవాని నగర్ తండా, నందనగార్డెన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏరియా, ఆకుల లక్ష్మయ్య కాలనీ, రాంచంద్రాపురం కాలనీ, నర్సంపేట బైపాస్, ఆర్టీసీ కాలనీ, ఏటాగడ్డతండా, హనుమంతునిగడ్డ, బెస్తబజారుల్లో సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి

● జడ్జి ధీరజ్ కుమార్



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి ధీరజ్‌కుమార్

తొర్రూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య సంరక్షణ హక్కు మాత్రమే కాదని, బాధ్యతగా తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ధీరజ్ కుమార్ అన్నారు. శుక్రవారం తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషి శారీరకంగా ఎంత ఆరోగ్యంగా కనిపించినా మానసికంగా బలహీనంగా ఉంటే జీవన గమనం లయ తప్పుతుందని, శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉండాలంటే మంచి అలవాట్లు ఉండాలని, సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. మానసిక రుగ్మతతో బాధపడే వారు ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నందన, ప్రియాంక, మీరజ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం విధిగా తీసుకోవాలి

● ఘనంగా పోషణ మాసోత్సవం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

మరిపెడ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విధిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని బోడ అమ్మ తండా అంగన్‌వాడీ పాఠశాలలో పోషణ మాసం సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి రోజు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు నిత్యం పోషక విలువలు గల పదార్థాలు పాలు, గుడ్లు, పప్పు ధాన్యాలు, కూరగాయలు, ఆకు కూరలు, విటమిన్లు, ఫైబర్, కాల్షియం గల ఆహారాన్ని తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు బోడ లక్ష్మి, పి.రాంబాయి, ఈ.పద్మ, బి.రాధ, పి.రజిత, కె రేణుక, ఎ.రేణుక, పి.ఉమ, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రతీ పంటను నమోదు చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల



మాటేడులో వరిపంటను పరిశీలిస్తున్న విజయనిర్మల

తొర్రూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేసిన ప్రతి పంటను పరిశీలించి నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలం మాటేడు గ్రామంలోని పంటను వ్యవసాయ శాఖ అధికారి రామనర్సయ్య ఆధ్వర్యంలో పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు సాగుచేసిన ప్రతి పంట వివరాలను ఏఈవోల దృష్టికి తీసుకువచ్చి నమోదు చేసుకోవాలని, ఏఈవోలు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయి వద్దకు పోయి పంటలను నమోదు చేయాలని ఆదేశించారు. పంటనమోదు చేసుకొనని ఎడల పంట కొనుగోలు సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు జమున, భరత్‌చంద్ర, వినయ్‌వర్మ రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్స్ పంపిణీ



కంఠాయపాలెం పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు

తొర్రూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు లయన్స్ క్లబ్ తొర్రూరు ఆధ్వర్యంలో శుక్రవారం ముచ్చరాజి రెడ్డి జన్మదినం సందర్భంగా నోట్ పుస్తకాలు, స్కూల్‌బ్యాగ్స్‌తో పాటు స్కూల్ అటెండర్లు, వంట మనుషులకు చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సూర్దం రామనర్సయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కోటేశ్వరరావు, ఎండీ సలీం తదితరులు పాల్గొన్నారు.

బీసీ నేతలపై విమర్శలు సరికాదు

తొర్రూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ హక్కులపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదగాని సోమయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీ హక్కులకు కట్టుబడి ఉన్న సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో 42శాతం రిజర్వేషన్లపై అహర్నిశలు కృషి చేస్తున్నాడని, అలాంటి నేతలపై బీఆర్ఎస్ నేతలు నోరుపారేసుకోవడం హాస్యాస్పదమని అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా వెనుకబడిన వర్గాలకు తగిన న్యాయం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కామారెడ్డిలో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని ప్రక్రియలు పూర్తి చేసిందన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌లు కుట్రలు పన్ని అడ్డంకులు సృష్టిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం కులగణన చేపట్టడమే కాక ఏకసభ్య కమిషన్‌ను నియమించారని, బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడం పక్కా అని, రానున్న రోజుల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రజలు తగిన బుద్ధి చెపుతారని విమర్శించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తొర్రూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పట్టణ విద్యుత్ ఏఈ రాజేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం తొర్రూరు విద్యుత్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సబ్ స్టేషన్‌లలో ఉదయం 9 నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్

మహబూబాబాద్ క్రైం అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులపేట గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెలిమల్ల యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షుడిగా మొగులగాని పురుషోత్తంతో పాటు ఎనిమిది మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఉన్నుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరిగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన గౌడ సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల పరిష్కారంతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నర్సింహులపేటలో కులదైవం శ్రీ కంఠమామహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గాడిపెల్లి రవి, యాదగిరి, రమేష్, వీరన్న, వెంకన్న, శ్రీను ఉన్నారు.

మానసిక రోగులను ప్రతీ పౌరుడు గౌరవించాలి

● ఆర్ఎంవో జగదీశ్వర్

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానసిక రోగులను ప్రతీ పౌరుడు గౌరవించాలని జిల్లా ప్రధాన ఆస్పత్రి ఆర్ఎంవో జగదీశ్వర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో షార్ట్ ఫిలీం ప్రదర్శించారు. మానసిక రోగులను గౌరవించాలి. మానసిక సమస్యతో ఉన్న వారిని తిరస్కరించకుండా వారి భావాలను అర్థం చేసుకొని సరైన సపోర్టు ఇవ్వాలన్నారు. మత్తు పదార్థాలకు బానిలైన మానసిక రోగులు విముక్తి పొందడం అనే అంశంపై లఘు చిత్రం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేతిరెడ్డి సేవా కార్యక్రమాలు అభినందనీయం

● ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్



బొమ్మకల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్

పెద్దవంగర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు, పాఠశాల అభివృద్ధి కోసం కేతిరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ అన్నారు. శుక్రవారం పెద్ద వంగర మండలం బొమ్మకలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దీపిక - సోమనర్సింహారెడ్డి దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి రూ.లక్ష విలువ గల టేబుల్స్, విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ అవసరార్థులకు సేవ చేయడం ద్వారానే ఆత్మ సంతృప్తి చెందుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణ పట్టుదలతో చదవి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సునీల్, శ్రీనివాస్, సురేశ్, హరీశ్, సత్యంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు వెంకటరామయ్య, గిరగాని రవి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ బకాయిలు విడుదల చేయాలి



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తొర్రూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ పథకంలో చదువుకునే విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. శుక్రవారం నిధులు విడుదల చేయాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు ప్రారంభించిన బెస్ట్ అవలైబుల్ స్కీమ్‌కు నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను తరగతులకు అనుమతించడం లేదని, వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈదురు ఐలయ్య, సాయిమల్లు, వేణు, ఐలయ్య, సైదులు, వెంకన్న, యాకయ్య, నగేష్ తదితరులు ఉన్నారు.

కన్నుల పండువగా వేట వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం



కోనేరులో స్వామివారి తేప్పోత్సవాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

● మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే కోరం
● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

గార్ల, అక్టోబరు 10 (ఆధ్రజ్యోతి): మర్రిగూడెం సమీపంలోని వేట వేంకటేశ్వరస్వామి వారి తెప్పోత్సవాన్ని శుక్రవారం కోనేరులో అర్చకులు నిర్వహించారు. ఏట స్వామివారి కల్యాణం నిర్వహించిన అనంతరం మూడోరోజు వేంకటేశ్వర స్వామి సమేత భూదేవి, శ్రీదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన శకటంపై ప్రతిష్ఠించి, కోనేరులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ తెప్పోత్సవాన్ని వీక్షించేం దుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, సూర్యా పేట జిల్లాల నుంచి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

వేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. దేవాలయంలో స్వామి వారికి మొక్కులు సమర్పించుకొని, తెప్పోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, రైల్వే మాజీ ఉన్నతాధికారి భూక్యా కస్నానాయక్, పల్లఖండం రమేష్‌బాబు, రావూరి వెంకట్రామ య్య, పుల్లఖండం వేణుగోపాల్, కోట ఉత్తరయ్య, పర్చురి కుటుంబరావు, మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, భూక్యా నాగేశ్వరరావు, అశోక్‌నా యక్, అర్జున, భూక్యా రాములు మల్లి బాబునాయక్ పాల్గొన్నారు. గార్ల, బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై రీయాజ్ పాష బందోబస్తును ఏర్పా టు చేశారు. భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందించారు.

బస్ సౌకర్యం పునరుద్ధరణ



గంగారం మీదుగా నర్సంపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్

గంగారం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు శాటిలైట్ డిపో నుంచి గంగారం మీదుగా నర్సంపేటకు బస్ సౌకర్యాన్ని శుక్రవారం నుంచి పునరుద్ధరించినట్లు కొత్తగూడెం బస్‌డిపో మేనేజర్ రాజ్యలక్ష్మీ తెలిపారు. ఇల్లెందు నుంచి ఉదయం ఏడు గంటలకు ఒక ట్రిప్పు, రెండు గంటలకు మరోట్రిప్పు గంగారం మీదుగా నడుస్తుందని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల క్రితం ఇల్లెందు నుంచి గంగారం మీదుగా నర్సంపేటకు మూడు సర్వీసులు నడిచేవి. గంగారం నుంచి పాకాల చెరువు వరకు రోడ్డ సక్రమంగా లేకపోవటం, ఆర్టీసీకి లాభాలు రావటంలేదని సర్వీసులను రద్దు చేశారు. మంత్రి సీతక్క చొరవతో ఇల్లెందు నుంచి బస్ ఏర్పాటు చేయటంతో గంగారం నుంచి నిత్యవసరాలు తెచ్చు కునేందుకు మార్గం సులభమైందని ప్రజలు హర్షం వక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రెడ్యా పరామర్శ

డోర్నకల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కేంద్రానికి చెందిన గండి వెంకమ్మ, గండి సుభద్ర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ మృతుల చిత్రపటాల వద్ద నివాళ్లర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. ఆయన వెంట డోర్నకల్ పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షం రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాండునాయక్, కత్తెరసాల విద్యాసాగర్, తప్ప వరలక్ష్మి, శరత్‌బాబు, మధు, రాము, బొర్రాజు శ్రీనివాస్, పచ్చిపాల మల్లేశం, బాదావత్ బాలాజీ, కందుల మధు, మాతంగి అనిల్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కొమురంభీం పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

● ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీనివాస్



కొత్తగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కొత్తగూడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కొమరంభీం పోరాట స్ఫూర్తితో ఆదివాసీలు ఉద్యమించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ పూనెం శ్రీనివాస్, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వట్టం ఉపేందర్ పిలుపునిచ్చారు. కొత్తగూడలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో కొమరబీం వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ముందుగా కొత్తగూడలో ఆదివాసీ సంప్రదాయ డోలు వాయిద్యాలు మ్రోగిస్తూ ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కొమరంభీం విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, ఉపేందర్ మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్ నినాదాలతో ఆదివాసీల అస్తిత్వం కోసం పోరాడిన యోధుడు కొమరంభీం అని కొనియాడారు. కొమరంభీం పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేవరకు ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల మెడలు వంచి ఆదివాసీలు రిజర్వేషన్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఈసం సుధాకర్, సిద్ధబోయిన సంజీవరావు, ధనసరి రాజేష్, కుంజ నర్సింగరావు, బొల్లి సుధాకర్, పెండకట్ల లక్ష్మీనర్సు, పూనెం సందీప్ దొర, ఈసం రామస్వామి, మల్లెల సారయ్య, ఉద్యోగ సంఘాల నాయకులు వాసం వీరస్వామి, కల్తీ ఎల్లయ్య, ఈసం సమ్మయ్య, పెనుక ప్రభాకర్, రేగ పాపారావు, దొర పటేళ్ల పూనెం రామాస్వామి, వజ్జ లక్ష్మీనర్సు, వివిధ పార్టీ నాయకులు భూర్క వెంకటయ్య, పాయం చిన్న చంద్రన్న, గుమ్మడి సమ్మయ్య, వాసం వెంకన్న, వాసం మునీందర్, శ్రీశైలం, బంగారి నరేష్ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి: సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి అలవాల సత్యవతి

గార్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తుపాన్‌తో నష్టపోయిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ చేపట్టి, సకాలంలో రైతులకు పరిహారం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మంగపతిరావు స్మారక భవనంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పకృతి కన్నెర్ర చేసి నెల రోజుల పాటు ఎడతేరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా వరి, పత్తి, మిర్చి మొక్కజొన్న పంటలు పూర్తి నేలమట్టం కావడంతో రైతులు తీవ్రంగా నష్ట పోవడం జరిగిందన్నారు. అధికారులు పంట నష్టం అంచనాలు తయారు చేసి, రైతులకు పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు, నాయకులు భాగం లోకేశ్వరరావు, గోవిందు, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, మౌనిక, ఈశ్వరలింగం, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

● అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు తోట సురేష్



కొమ్ములవంచలో కబడ్డీ క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించిన ప్రతీ క్రీడాకారునికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు తోట సురేష్ అన్నారు. కొమ్ములవంచలో 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల,బాలికల కబడ్డీ క్రీడలను శుక్రవారం జ్యోతి ప్రజ్వల చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఫ్లడ్‌కోర్టు ఏర్పాటు చేసి, రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కొమ్ములవంచ గ్రామం కబడ్డీ క్రీడకు పుట్టినిల్లని, ఇక్కడి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీ క్రీడల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడలు 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అనంతరం డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత క్రీడలపట్ల శ్రద్ధచూపి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గండి సత్యనారాయణ, జ్యోతి, బండారి, వెంకటరత్నం, రాజశేఖర్, బానోతు దస్రూనాయక్, మైదం మల్లయ్య, చంద్రబాను, లక్ష్మీనారాయణ, అమీర్‌పాషా, అధికారులు, క్రీడల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎండుటాకుల వేరేషాన్

» నిలిచిన సీనియర్ సిటిజన్ కార్డుల జారీ
» ఆరు నెలలుగా మంజూరుకు సర్కార్ బ్రేక్
» ఇబ్బందులు పడుతున్న వయో వృద్ధులు
» ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 19,800 కార్డులు
» కార్యాలయాల చుట్టూ వృద్ధుల ప్రదక్షిణ

హనుమకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్స్ కార్డు(ఎస్‌సీసీ)ల జారీ నిలిచిపోవడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్డుల కోసం జిల్లా వయోవృద్ధులు, స్త్రీశిశు సంక్షేమ కార్యాలయం చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా అయినా కార్డులు పొందుదామనుకున్నా వీలు కావడం లేదు. ఇందుకు సంబంధించిన సైట్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం మూసి వేసింది. 60 సంవత్సరాలు దాటిన పురుషులు, 58 సంవత్సరాలు పైబడిన మహిళలకు సీనియర్ సిటిజన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తుంది. దేశవ్యాప్తంగా సీనియర్ సిటిజన్ కార్డు చెల్లుబాటు అవుతుంది. ముదిమి వయసులో కన్న బిడ్డల నుంచి నిరాదరణకు గురైనవారికి, ఎలాంటి ఆధారం లేని అనాథ వృద్ధులకు ఆశ్రమాల్లో సేవలు పొందేందుకూ అవసరం అవుతుంది. దేశవ్యాప్తంగా కార్డుల జారీ కొనసాగుతున్నా రాష్ట్రంలో మాత్రం 6 నెలలుగా నిలిచిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో కార్డుల సమస్యను పరిష్కరించాలంటూ వృద్ధులు అర్జీలు పెట్టుకున్నారు.

దరఖాస్తులు పెండింగ్

కలెక్టరేట్, డబ్ల్యూజీఎంసీ కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్ దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. కార్డుల కోసం వెళ్తే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందని అధికారులు చెబుతున్నారు. ఈ కార్డు ద్వారా గతంలో పొందిన ప్రయోజనాలు ఇప్పుడు వృద్ధులు పొందలేకపోతున్నారనీ, అందువల్ల ఈ కార్డులు ఉన్నా లేకున్నా ఒకటే అనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలుస్తోంది. అయితే రైల్వే, ఆర్టీసీ వంటి రవాణాకు గతంలో లాగా ఇప్పుడు ప్రయాణ చార్జీల్లో రాయితీలు ఇవ్వడం లేదు. 58 ఏళ్ల పైబడిన మహిళలు, 60 ఏళ్ల దాటిన పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు 40 శాతం టికెట్ ధరలో రాయితీ ఉండేది. కరోనా నేపథ్యంలో 2020 మార్చిలో ఈ వెసులుబాటును నిలిపివేసిన రైల్వే శాఖ పునరుద్ధరించలేదు. కానీ మిగతా ప్రయోజనాలు యథాతథంగానే ఉన్నాయి. అలాంటప్పుడు కార్డుల జారీని నిలిపివేయడం ఎందుకు ? అని వృద్ధులు ప్రశ్నిస్తున్నారు. సీనియర్ సిటిజన్లు అని ధ్రువీకరించుకోవడానికి ఆధార్ కార్డు సరిపోతుందని, వాటి ఆధారంగా సీనియర్ సిటిజన్ కార్డు ప్రయోజనాలను పొందవచ్చునని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం సీనియర్ సిటిజన్ కార్డు ఉండాల్సిందేనని చెబుతున్నారని వయోవృద్ధులు వాపోతున్నారు.



ఆన్‌లైన్‌లోనూ అవకాశం లేక..

కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదని మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు అంటున్నారు. వెబ్‌సైట్‌లో ఫ్యామిలీ కార్డు వరకు అప్లికేషన్ వెళ్తున్నా కార్డు డౌన్‌లోడ్ చేస్తుంటే ఎర్రర్ అని వస్తోందని చెబుతున్నారు. మాన్యువల్ అయితే చిరునామా ఎక్కడ ఉంటుందో అక్కడి మండల, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో మీ-సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో కార్డులను ఉచితంగా జారీ చేస్తుండగా తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది.

వైద్య సాయం

వృద్ధులకు ఆరోగ్య భరోసాను ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన' (ఏబీ-పీఎంజేఏవై) పథకాన్ని ప్రారంభించింది. వార్షిక సంపాదనతో సంబంధం లేకుండా 70 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 5 లక్షల బీమా అందిస్తారు. ఎస్‌సీసీ పొందిన వారికి సంవత్సరానికి కనీసం రూ. 5 లక్షల మేరకు వైద్యసాయం అందుతుంది. రాష్ట్రంలో ఈ కార్డుల జారీ లేక ఆ అవకాశాన్ని వయో వృద్ధులు కోల్పోతున్నారు.

ప్రయోజనాలెన్నో..

సీనియర్ సిటిజన్ కార్డుతో సంక్షేమ పథకాలు సులభంగా పొందవచ్చు. వయసు ధ్రువీకరణ, ఆధార్, ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలు చూపాల్సిన అవసరం లేదు. ఆర్టీసీ బస్ టికెట్‌లో 25 శాతం రాయితీ లభిస్తుంది. కేసుల విచారణలో కోర్టులు ప్రాధాన్యం ఇస్తాయి. బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక లైన్లు ఉంటాయి. పన్ను మినహాయింపులూ ఉంటాయి.

మినహాయింపులు

సీనియర్ సిటిజన్ కార్డు ఉంటే 60 సంవత్సరాలు పైబడిన వారికి రూ. 3లక్షల వరకు, 80 ఏళ్ల పైబడిన వారికి రూ. 5 లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయింపు లభిస్తుంది. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై పన్ను తగ్గింపు ఉంటుంది. సీనియర్ సిటిజన్లకు వడ్డీ రూపంలో వచ్చే ఆదాయంపై రూ. లక్ష వరకు టీడీఎస్ మినహాయింపు పరిమితి వర్తిస్తుంది. జాతీయ వృద్ధాప్య పెన్షన్ పథకం వంటి వాటి కింద పెన్షన్ పొందవచ్చు. పలు విమానయాన సంస్థలు సీనియర్ సిటిజన్లకు ప్రయాణ చార్జీల్లో డిస్కౌంట్లు ఇస్తున్నాయి. సీనియర్ సిటిజన్లు బ్యాంకుల్లో తీసుకునే వ్యక్తిగత రుణాలకు 1 నుంచి 1.5 శాతం వడ్డీ రాయితీ లభిస్తుంది. సీనియర్ సిటిజన్ పొదుపు పథకం కింద 60 ఏళ్ల దాటిన వృద్ధులు చేసిన డిపాజిట్లపై బ్యాంకులు 8.2 శాతం వడ్డీ ఇస్తాయి.

ఉమ్మడి జిల్లాలో 19,800 కార్డులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల వరకు 19,800 సీనియర్ సిటిజన్ కార్డులు జారీ అయ్యాయి. హనుమకొండ జిల్లాలో 4,200 ఎస్‌సీసీలు జారీ అయ్యాయి. వరంగల్ జిల్లాలో 4,050, జనగామ జిల్లాలో 3,900, మహబూబాబాద్‌లో 4,350, ములుగులో 1,600, భూపాలపల్లి జిల్లాలో 1,700 కార్డులు జారీ అయ్యాయి.

సీనియర్ సిటిజన్స్ కార్డులు జారీ చేయాలి



వయోవృద్ధులకు ఎన్నో ప్రయోజనాలు అందించే సీనియర్ సిటిజన్ కార్డుల జారీని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం అన్యాయం. ఆధార్‌కార్డు ఎలాగూ ఉందన్న కారణంతో సీనియర్ సిటిజన్ కార్డు అవసరం లేదని నిలిపివేయడం సరికాదు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్డులు జారీ అవుతుండగా ఇక్కడ మాత్రం రద్దు చేయడం దారుణం. గతంలో మాదిరిగానే సీనియర్ సిటిజన్ కార్డులను జారీ చేయాలి. ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో ప్రభుత్వానికి వినతి పత్రాన్ని సమర్పించబోతున్నాం.

తేరాల యుగేంధర్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

వీధి కుక్కలపై స్పెషల్ డ్రైవ్

- వందకు పైగా కుక్కల పట్టివేత
- చింతగట్టు ఏబీసీ సెంటర్‌కు తరలింపు



వీధి కుక్కలను వాహనంలో తరలిస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకునేందుకు బల్దియా సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేశారు. ఒక్క రోజే సుమారు వందకుపైగా వీధి కుక్కలను పట్టుకుని చింతగట్టు ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)కు తరలించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పిక్కలు పీకుతున్న వీధి కుక్కలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. వెంటనే వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ స్పందించి బల్దియా వెటర్నరీ విభాగం అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. జీడబ్ల్యూఎంసీ వెటర్నరీ అధికారి గోపాల్‌రావు పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో స్వతంత్ర యానిమల్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది (బిహార్ యువకులు) ఉదయమే రంగంలోకి దిగారు. సుమారు 20మంది మూడు వాహనాలలో సంచరిస్తూ వీధి కుక్కలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సుమారు వందకుపైగా వీధి కుక్కలను పట్టుకున్నట్టు అధికారులు వెల్లడించారు. పట్టుకున్న వీధి కుక్కలను చింతగట్టులోని ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)కు తరలించారు. అయితే పట్టుకున్న వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసి పట్టుకున్న చోటనే వదిలివేస్తామని బల్దియా వెటర్నరీ డాక్టర్ గోపాల్‌రావు తెలిపారు. నగరంలో ఇకపై ఎక్కడైనా కోతులు, వీధి కుక్కల సమస్యలు ఉత్పన్నమైతే 97019 99701 సెల్ నెంబర్‌కు ఫోన్ చేయాలని గోపాల్‌రావు తెలిపారు.

సారథులెవరో!?

(5వ పేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లినట్లుగా ప్రచారం జరుగుతోంది. హనుమకొండ డీసీసీ అధ్యక్ష పదవి ఓసీలకు ఇస్తే, వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని కొండా దంపతులు పట్టుబడుతున్నారని సమాచారం. అలాగే దొంతి మాధవరెడ్డి ఈ సారి తన అనుచరులకే డీసీసీ పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నారని తెలుస్తోంది. దీంతో వరంగల్ డీసీసీ అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా జరుగనుందనే చర్చ సాగుతోంది.

ములుగుపై సూర్య.. జనగామపై ఝాన్సీ నజర్..

కాంగ్రెస్ అధ్యక్ష పదవులపై కీలక నేతలు దృష్టి పెట్టారు. 2028లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుండటంతో కొత్త నియోజకవర్గాలు, పాత నియోజకవర్గాల రిజర్వేషన్లు, సరిహద్దులు మారనుండటంతో డీసీసీ అధ్యక్ష పదవిలో ఉంటే ఎమ్మెల్యే సీటుకు కర్చీఫ్ వేసుకున్నట్లే అనే భావనలో కొందరు సీనియర్ నేతలు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా పినపాక అసెంబ్లీ స్థానం నుంచి తన వారసుడిని బరిలోకి దించాలని మంత్రి సీతక్క తీవ్ర ప్రయత్నాలు చేశారు. అప్పట్లో రాజకీయ సమీకరణలతో అవకాశం చేజారింది. అయితే వచ్చే అసెంబ్లీ నాటికి తన వారసుడిని క్రియాశీలక రాజకీయాల్లో ఉంచాలనే లక్ష్యంతో సీతక్క వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌ను కొనసాగించకుంటే సూర్యను డీసీసీ పీఠంపై కూర్చోపెట్టవచ్చుననే చర్చ జరుగుతోంది.

ఇక జనగామ డీసీసీ పదవిపై టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి నజర్ వేశారనే ప్రచారం ఉంది. మొదటి నుంచి జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండాలని ఝాన్సీరెడ్డి భావిస్తున్నారు. అయితే టీపీసీసీ నుంచి వైస్‌ప్రెసిడెంట్ పదవి వచ్చినప్పటికీ తనకు జడ్పీ చైర్మన్ లేదా డీసీసీ అధ్యక్ష పదవుల్లో ఏదో ఒకటి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లుగా సమాచారం. అయితే ప్రస్తుత అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కొనసాగించకపోతే ఝాన్సీరెడ్డికి డీసీసీ అవకాశం దక్కవచ్చుననే ప్రచారం జరుగుతోంది. మరోవైపు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారసుడిగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సైతం డీసీసీ అధ్యక్ష పదవిపై కన్నేశారనే చర్చ నెలకొంది.

మానుకోట, భూపాలపల్లి జిల్లా పగ్గాలెవ్వరికో..?

సీఎం సలహాదారుడు, వేం నరేందర్‌రెడ్డి సొంత జిల్లా మహబూబాబాద్‌లో డీసీసీ అధ్యక్ష పదవిపై పలువురు నేతలు కన్నేశారు. ప్రస్తుత అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చంద్రారెడ్డి మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లుగా సమాచారం. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌కు సేవలు అందిస్తున్న భరత్‌చంద్రారెడ్డికి ఏదైనా నామినేటెడ్ పదవిని ఇస్తే.. మరొకరికి డీసీసీ అధ్యక్ష పదవికి లైన్‌క్లియర్ అవుతుందని చర్చ జరుగుతోంది. అలాగే కాంగ్రెస్ యువనేత, వేం నరేందర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న వెన్నం శ్రీకాంత్‌రెడ్డి పేరు కూడా డీసీసీ అధ్యక్ష పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే జడ్పీ చైర్మన్‌గా శ్రీకాంత్‌రెడ్డికి అవకాశం ఇస్తే.. డీసీసీ రేసు నుంచి తప్పుకుంటారని సమాచారం. అలాగే బీసీలకు అవకాశం ఇవ్వాలని మహబూబాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య కోరుతున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు ముగ్గురు కూడా మానుకోట హస్తం పగ్గాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇక ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత జిల్లా భూపాలపల్లి డీసీసీ అధ్యక్ష పదవి ఉత్కంఠగా మారింది. ప్రస్తుత అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి మంత్రి శ్రీధర్‌బాబు అనుచరుడే. ప్రకాష్‌రెడ్డికి కార్పొరేషన్ పదవి రావటంతో డీసీసీ అధ్యక్ష పదవికి శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు పేరు తెరపైకి వస్తోంది. అయితే ప్రస్తుత అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డితో పాటు గ్రంథాలయ చైర్మన్ పదవికి కూడా మంథని నియోజకవర్గానికే దక్కింది. మరోసారి డీసీసీ అధ్యక్ష పదవి కూడా శ్రీధర్‌బాబు నియోజకవర్గానికే దక్కితే, తమ పరిస్థితి ఏమిటని భూపాలపల్లి నియోజకవర్గ నేతలు ప్రశ్నిస్తున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ప్రధాన అనుచరుడిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి, మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ పేరు కూడా డీసీసీ అధ్యక్ష పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. అశోక్‌తో పాటు చల్లూరి మధు కూడా డీసీసీ పదవికి దరఖాస్తు చేయమని అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చినట్లుగా సమాచారం. అలాగే ప్రముఖ వ్యాపారి ఎన్.సంపత్‌రావు (ఎన్ఎస్ఆర్) పేరును కూడా అధిష్టానం పరిశీలిస్తోందనే చర్చ జరుగుతోంది.

కరాటేలో అక్కాతమ్ముళ్ల ప్రతిభ

» గిన్నిస్ బుక్‌లో ఆసియా, ఇర్ఫాన్‌కు చోటు
» అభినందించిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఆసియా, ఇర్ఫాను అభినందిస్తున్న ఎంపీ కడియం కావ్య

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'ద వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఎస్ఐబీఈటీ కళాశాల మైదానంలో నిర్వహించిన కరాటే ప్రదర్శనలో ఓరుగల్లులోని ఒకే కుటుంబానికి చెందిన అక్క, తమ్ముడు ఎం.డి. ఆసియా, ఎం.డి. ఇర్ఫాన్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని సుమారు 4గంటలుగా ఏకధాటిగా పంచెస్, కటాస్‌తో పాటు కరాటేలో ప్రదర్శనలు చేయడంతో గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ద వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాస్టర్ బాలమురుగన్ పర్యవేక్షణలో జరిగిన ప్రదర్శనకు లండన్ దేశానికి చెందిన గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ అధికారి రిషినాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ క్రమంలో శుక్రవారం ఆసియా, ఇర్ఫాన్‌లు తమ కుటుంబసభ్యులతో హనుమకొండలోని వరంగల్ ఎంపీ కడియం కావ్యను, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆసియా, ఇర్ఫాన్‌కు పూల బొకేలు అందించి, శాలువాలతో సన్మానించారు. కఠోర శ్రమ ద్వారా ఆసియా, ఇర్ఫాన్‌లు ఘనత సాధించి జిల్లా, రాష్ట్రకీర్తిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. కాగా, వరంగల్ కొత్తవాడకు చెందిన ఆసియా ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ మైనారిటీ గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే విధంగా ఇర్ఫాన్ కొత్తవాడలోని ప్రైవేటు హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు ఆసియా, ఇర్ఫాన్ తల్లిదండ్రులు యాస్మిన్ సుల్తానా-నయీంపాషా, కరాటే మాస్టర్లు, సీనియర్ క్రీడాకారులు, హర్షం వ్యక్తం చేశారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

వివరాలు వెల్లడించిన ఏసీపీ సతీష్‌బాబు



నిందితుడి అరెస్టు చూపిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులు, మరో మైనర్ విద్యార్థితో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేశామని పరకాల ఏసీపీ సతీష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయం ఆత్మకూరు మండలం కటాక్షపురం గ్రామంలోని చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో పోలీసులను చూసి ద్విచక్రవాహనంపై పారిపోతుండగా సీఐ సంతోష్, హెడ్‌కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌లు వెంబడించగా పాశం ప్రణీత్, ఇంటర్ విద్యార్థిని పట్టుకున్నారు. ఇందులో మరో వ్యక్తి మున్నీసాయి తప్పించుకుని పారిపోయాడన్నారు. గ్రామస్థుల సమక్షంలో విచారించగా మండలంలోని గూడెప్పాడ్ రామాలయంలో చోరీకి పాల్పడి నగదుతో పాటు వెండి జంజరం, రెండు బంగారు పుస్తెలు దొంగిలించినట్టు, అలాగే ముగ్గురు కలిసి దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద గల వైన్స్ వెంటిలేటర్‌కు ఉన్న గ్రిల్స్‌ను పగులగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ. 12వేల నగదు, చిల్లరతో పాటు 10 మద్యం బాటిళ్లను దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారని ఏసీపీ తెలిపారు. మద్యంబాటిళ్లను తాగినట్లు వారు అంగీకరించారని ఏసీపీ తెలిపారు. గూడెప్పాడ్ రామాలయంలో జరిగిన దొంగతనం చేసిన వాటిలో రూ.1000 నగదు, వెండి జంజరం, రెండు బంగారు పుస్తెలను ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

ఇందులో పాశం ప్రణీత్‌ది హనుమకొండ జిల్లా గోపాల్‌పూర్‌కు చెందిన వ్యక్తి, కాగా, ఇంటర్ విద్యార్థి భీమారంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు, పారిపోయిన యువకుడిని త్వరలో అరెస్టు చేస్తామని ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు కుమారస్వామి, శ్రీనివాస్‌లను పరకాల ఏసీపీ సతీష్‌బాబు అభినందించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు సీఐ సంతోష్, ఎస్సైలు సతీష్, తిరుపతి, కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జ్ఞానంతో అర్థం చేసుకుంటేనే నిజమైన విజ్ఞానం

» భారత లోహ పరిశోధన సంస్థ గౌరవ సభ్యుడు డాక్టర్ సనక్ మిశ్రా
» వరంగల్ నిట్‌లో ఘనంగా 67వ వ్యవస్థాపక దినోత్సవం



డాక్టర్ సనక్ మిశ్రాకు జ్ఞాపికను అందిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాన్ని లోతుగా అర్థం చేసుకోవడం ద్వారానే నిజమైన విజ్ఞానాన్ని పొందగలుతామని, మేధోమథనం సాధ్యమవుతుందని భారత లోహ పరిశోధనా సంస్థ (ఐఐఎం) గౌరవ సభ్యుడు డ్టార్ సనక్ మిశ్రా అన్నారు. శుక్రవారం వరంగల్ నిట్‌లో 67వ వ్యవస్థాపక దినోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మిశ్రా.. భారత ఉపఖండంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా కూడా జ్ఞానం ఎలా పరిణామం చెందిందో వివరించారు. స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా గవర్నింగ్ బోర్డు సభ్యుడు, రూర్కెల స్టీల్ ప్లాంట్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ కూడా డాక్టర్ సనక్ మిశ్రా 'ది హైపోతిసిస్ ఆఫ్ ది హైయారీక ఆఫ్ నాలెడ్జ్' అనే అంశంపై వ్యవస్థాపక ప్రసంగం చేశారు. వరంగల్ నిట్ తన 67 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక మైలురాళ్లు దాటి దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థగా తనదైన ప్రత్యేకతను నిలబెట్టుకున్నదన్నారు.

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి నిట్ అసాధారణ ప్రయాణాన్ని వివరించారు. మూడు అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలతో ప్రారంభమైన ఈ విద్యా సంస్థ.. నేడు దేశంలోనే అగ్రగామి సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. ప్రస్తుతం నిట్‌లో 11 బీటెక్, 26 ఎంటెక్, 5 ఎంఎస్‌సీ, ఎంసీఏ, ఎంబీఏ, బీఎస్‌సి బీఎడ్, సమగ్ర ఎంఎస్‌సీ కోర్సులు బోధిస్తున్నట్టు తెలిపారు. తాజాగా పునర్వించించిన పాఠ్యక్రమం, స్వయం అభ్యాసం, ఆవిష్కరణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణ్యమైన నైపుణ్యాల పెంపుపై దృష్టిసారించినట్టు తెలిపారు. 8వేలు మంది విద్యార్థులు, 700 మంది అధ్యాపకులు, సిబ్బంది, అలాగే 42,600 మందికిపైగా పూర్వ విద్యార్థులతో బలమైన నెట్‌వర్క్‌ను నిట్ కలిగి ఉందన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో అధ్యాపకులు 884 జర్నల్ పేపర్లు, 350 కాన్ఫరెన్స్ పేపర్లు, 127 పుస్తక అధ్యాయాలు ప్రచురించి, 95 జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నదని, అలాగే వివిధ పరిశోధనలపై 25 పేటెంట్లు పొందిందని పేర్కొన్నారు. నిట్‌కు రూ.45.65కోట్ల విలువైన పరిశోధనా నిధులు అందాయని చెప్పారు. నిట్‌లో 81.3 శాతం ప్లేస్‌మెంట్ రేటు సాధించిందని, అత్యధిక వార్షిక ప్యాకేజీ రూ.64లక్షలుగా నమోదైందని, ఆరు బీటెక్ కార్యక్రమాలు జూన్ 2028 వరకు ఎన్‌బీఏ టియర్-1 గుర్తింపు పొందాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వరంగల్, హైదరాబాద్ అలుమ్ని చాప్టర్ల సభ్యులు పాల్గొన్నారు.

వేయి స్తంభాల గుడిలో సంకటహర చతుర్థి

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో శుక్రవారం సాయంత్రం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఉత్తిష్ఠ గణపతికి మూలమంత్ర యుక్తంగా పంచామృతాభిషేకం, నారికేళ జలాభిషేకం, కుంకుమ హరిద్రా లేపన అభిషేకం నిర్వహించారు. జిల్లేడు దండలతో అర్చనాది కార్యక్రమాలు నిర్వర్తించారు. నివేదన నీరాజన మంత్ర పుష్పముల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైదిక బృందం గంగు ఉపేంద్రశర్మ, పెండ్యాల సందీప్ శర్మ, గంగు మణికంఠ శర్మ, ప్రణవ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ బంగారం.!

- తులం రూ.1.27 లక్షలు
- సగానికి పడిపోయిన విక్రయాలు
- పెరుగుతున్న ధరలతో ధనవంతుల్లో ఉత్సాహం
- మధ్య తరగతి వర్గాల్లో కలవరం

కేసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ద్రవ్యంగా పేరున్న బంగారం ధర రోజురోజుకూ పెరుగుతూ అంతనంత ఎత్తుకు వెళ్లి మరింత ఎగబాకుతుండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కలవరపడుతున్నారు. నిత్యం బంగారం ధర పెరుగుతూ రోజుకో రికార్డు నెలకొల్పుతోంది. ప్రస్తుతం తులం బిస్కెట్ బంగారం రూ.1.27లక్షలుగా ఉంది. గత నాలుగు నెలల క్రితం రూ.70వేల నుంచి రూ.80వేల వరకు ఉన్న బంగారం ధర మూడు నెలలుగా క్రమంగా పెరుగుతోంది. ఆగస్టు రెండోవారంలో తులం బంగారం ధర రూ.1లక్ష దాటడంతో అంతా అవాక్కయ్యారు. ఆ తర్వాత గత 20 రోజులుగా వేగంగా పెరుగుతూ తాజాగా తులం బంగారం రూ.1.27లక్షలకు చేరింది. అంతర్జాతీయ ఆర్థిక అస్థిరత, యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలతోపాటు పలు కారణాలతో బంగారం ధరలు వేగంగా పెరుగుతున్నట్లు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుందనే అంచనాలతో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా చూసే వారిలో ఈ ధరల పెరుగుదల మరింత ఉత్సాహాన్ని పెంచుతూ కొనుగోలు చేస్తున్నారు. ధనవంతులు బంగారం ఖరీదులు మరింత చేస్తుండగా పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి వర్గాలు పసిడిని కొనడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.



గ్రామీణుల్లో కలవరం..

గ్రామీణ ప్రాంతాల్లో పంట ఉత్పత్తులు విక్రయించిన అనంతరం పెట్టుబడులు పోను మిగిలిన సొమ్ముతో చాలా మంది రైతులు తమ కుటుంబీకుల కోసం బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేవారు. సుస్థిర ద్రవ్యత్వం కలిగి ఆపద సమయంలో ఆదుకుంటుందని, భవిష్యత్తు అవసరాల కోసం బంగారం కొనిపెట్టుకోవడం చాలా మంది రైతులు, గిరిజన కుటుంబాల్లో ఏటా జరుగుతుండేది. గతంలో తులం బంగారం కొనగలిగే స్థోమత ఉన్నవారు ఇప్పుడు రెండు, మూడు గ్రాములకే పరిమితమవుతున్నారు. బంగారం ధర కొద్దిరోజులపాటు స్థిరంగా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని బంగారం షాపుల్లో పెళ్లిళ్ల, ఇతర శుభకార్యాలకు ఆభరణాలను ఆర్డరు ఇచ్చి మొత్తం ధరలో 10 నుంచి 30శాతం అడ్వాన్సు ఇచ్చేవారు.

తాజా ధరల అనిశ్చితి నేపథ్యంలో ఆభరణాల విలువలో 85 నుంచి 90శాతం అడ్వాన్సు ఇస్తేనే తయారు చేసే పరిస్థితి నెలకొందని పలువురు బంగారం షాపుల యజమానులు చెబుతున్నారు. ఏదేమైనా ధనవంతులు మరింత పెరుగుతుందని ఆశాభావంతో ఉత్సాహంగా బంగారం కొనుగోలు చేస్తుండగా గ్రామీణ ప్రాంతాల్లో మధ్యతరగతి వర్గాల్లో అమ్మాయి పెళ్లిళ్ల చేసే వారు బంగారం ధరలతో గుబులు చెందుతున్నారు.

కొనేటట్లు లేదు...

- కొమ్ము రజని, కేసముద్రం



బంగారం ధర వింటేనే గుండెగుబేలుమంటోంది. తులం రూ.1లక్ష అంటే ఎక్కువ అనుకున్నాం. మరింత పెరుగుతూ రూ.1.27లక్షలతో మధ్యతరగతి వర్గాలకు బంగారం అందనంత ఎత్తుకు చేరింది. పెళ్లిళ్ల చేసే వారు బంగారం కొనుగోళ్లకే అధికంగా వెచ్చించాల్సివస్తోంది.

ధర అడిగి.. లెక్క చేసుకొని వెళ్తున్నారు..

- వేణుగోపాలాచారి, బంగారం షాపు యజమాని, కేసముద్రం స్టేషన్



బంగారం ధర అడిగి...లెక్క చేసుకొని అంత డబ్బు పెట్టలేక కొనకుండా వెళుతున్నారు. పెరిగిన ధరలతో గిరాకీ పూర్తిగా పడిపోయింది. శుభకార్యాలకు వెండిపట్టీలు, బంగారు కమ్మలు పెట్టినవారు ధర అడిగి అంతపెట్టలేమని, నగదును కట్నంగా చదివిస్తాం అంటూ వెళ్లిపోతున్నారు. పెళ్లిళ్లకు ఐదు తులాలు కొనేవారు రెండు తులం, నాలుగైదు వస్తువులు చేయించే వారు ఒకటి, రెండు తయారు చేయించుకుంటున్నారు.



విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ బుక్స్ అందజేస్తున్న దక్షిణామూర్తి

పేద విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ఓ వరం : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల ఉన్నత విద్యకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ఓ వరమని డీఈవో దక్షిణామూర్తి అన్నారు. మహబూబాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతీ సంవత్సరం రూ. 12 వేలు స్కాలర్‌షిప్ వస్తుందని, ఆ డబ్బులు పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ, తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, టై, బెల్టులు, టీ షర్టులు, పరీక్షల సమయంలో పరీక్ష సామగ్రి అందించటం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, డీఎస్వో అప్పారావు, ఉపాధ్యాయులు యాకూబ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ అమలయ్యేంత వరకు పోరాటాలు

• ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న

కేసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలయ్యేంత వరకు పోరాటాలు చేపడుతామని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న తెలిపారు. కేసముద్రం అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అంశంలోప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కంచ వెంకన్న మాట్లాడుతూ బీసీల కోసమని జీవో నెంబరు తొమ్మిదిని తీసుకువచ్చి ప్రభుత్వం కాలయాపన చేసి న్యాయపరమైన చిక్కుల్లో నెట్టిందని ఆరోపించారు. అగ్రకులాల కుట్రల ఫలితంగా బీసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలన్నారు. ఆర్.సురేష్, మాచర్ల వెంకన్న, నేరడ వీరస్వామి, గుగులోత్ రాజు, ఐలయ్య, సమ్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు పుట్టగతులుండవ్

• బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కత్తి స్వామి

గూడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై హైకోర్టులో స్టే వచ్చేలా బీఆర్ఎస్ అడ్డుకుందని, ఆ పార్టీకి రాష్ట్రంలో పుట్టగతులుండవని గూడూరు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తిస్వామి, మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండీ యాకూబ్‌పాష అన్నారు. గూడూరు మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిబద్ధతతో, దృఢ సంకల్పంతో ఉందన్నారు. జీవో నెంబర్ 9 సవాల్ చేస్తూ రెడ్డి జాగృతి నేత మాధవరెడ్డి పేరిట దొంగచాటున బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులు పిటిషన్ దాఖలు చేసి కుట్రలు చేసిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో పుట్టగతులుండవని భావించి హైకోర్టులో స్టే వచ్చేలా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను బొందపెడితే తప్ప బుద్ధి రాదని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే, ఎంపీలు, ప్రధానమంత్రితో మాట్లాడి రాష్ట్రపతి ఆమోదం పొందేలా కృషి చేయాలన్నారు. 9వ షెడ్యూల్‌లో చేర్పించాల్సి పోయి దొంగనాటకాలడుతూ బీసీలకు తీవ్ర అన్యాయం చేయడంలో భాగస్వాములయ్యారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, తండ యాకాంబ్రం, కొరె కుమారస్వామి, కన్నెబోయిన వెంకన్న, కట్ల విష్ణు, అవుల అశోక్, ధరంసోత్ బాలు, యాదగిరి, మల్లేష్, మహేష్, రమేష్, సతీష్, యుగంధర్, హరి, చందు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఫీజుల భారం తగ్గించాలి

• పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు మహేష్‌కుమార్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు మునగాల మహేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానుకోటలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని 2025-26 విద్యాసంవత్సరం డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను తగ్గించాలన్నారు. విద్యార్థులకు ఒకేసారి ఫీజులను భారీగా పెంచడంతో ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఫీజులను తగ్గించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. షేక్ షబ్బీర్, మనోహర్, బిక్షం, నికిత, సంధ్య, శ్రావణి, వేణు తరుణ్ పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఐటీఐలో ప్రవేశాలకు 17లోగా దరఖాస్తు చేసుకోవాలి

• కళాశాల ప్రిన్సిపాల్ బాబు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ గ్రేడుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈనెల 10 నుంచి స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి 17 వరకు వాక్‌ఇన్ ద్వారా ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు స్పాట్‌లో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్ https. //iti. telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. అర్హులైన, ఆసక్తిగల అభ్యర్థులు 1 ఆగస్టు, 2025 వరకు విద్యార్థులకు 14 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు సంబంధిత అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సీట్ల భర్తీ ప్రక్రియ మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపాదికన కేటాయించబడునని తెలిపారు. మొదటి, రెండో, మూడోదఫాలో దరఖాస్తు చేసుకొని ప్రవేశం పొందని అభ్యర్థులందరు నేరుగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశానికి హాజరుకావచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సెల్‌ఫోన్ నెంబర్లు, ఆధార్ నెంబర్లు రాయాలని సూచించారు. జిల్లాలో అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.



డీఈ ఉపేందర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు

మాణిక్యనగర్ కాలనీకి రోడ్డు ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ శివారు మాణిక్యనగర్ కాలనీకి రోడ్డు ఏర్పాటు చేయాలని సీపీఎం టూటౌన్ కమిటీ కార్యదర్శి సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ 20వ వార్డు పరిధిలోని మాణిక్యనగర్ కాలనీ ఏర్పడి దాదాపు 20 సంవత్సరాలు కావస్తుందని, ఐనా నేటికి ఆ కాలనీలో మౌళిక వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలైట్లు లేకపోవడంతో చీకట్లో నడుచుకుంటూ వెళ్తున్నారని, చెత్తాచెదారం పెరిగి దోమలు కుట్టి విషజ్వరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం మునిసిపల్ డీఈ ఉపేందర్‌కు వినతిపత్రాన్ని అందించారు. డి.హేమానాయక్, ఎర్ర శ్రీనివాస్, ఎస్కే తజ్జు, గుండా వెంకటేశ్వర్లు, భాస్కర్, ఖదీర్, గణేష్, రవి, అంజి, ధనలక్ష్మి, శశిరేఖ, వెంకన్న, ఇర్ఫాన్, షరీఫ్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

కేసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం వేధింపులకు తాళలేక కేసముద్రం స్టేషన్ గిర్నీతండాకు చెందిన బానోత్ లైలా(24) ఎలుకల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న కేసులో ఆమె భర్త బానోత్ వినోద్‌ను శుక్రవారం మహబూబాబాద్‌లో డీఎస్పీ తిరుపతిరావు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ క్రాంతికిరణ్ తెలిపారు. గతనెల 19న లైలా ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయం విదితమే. మృతురాలి తండ్రి ఈర్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త వినోద్, అత్త కమిలీ, తాత రాంకోటిలపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తొలుత భర్త వినోద్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో ఒకరి అరెస్ట్

కేసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోరుకొండపల్లిలో గతనెల 15న ఇంటి దారి విషయంలో గోనె నరేష్, గోనె భారతమ్మలపై దాడి చేసిన కేసులో కొమురమల్లును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ క్రాంతికిరణ్ తెలిపారు. ఈ దాడిలో భారతమ్మ చేయి విరగడంతో ఆమె కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. నిందితున్ని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఆరోగ్య సిబ్బంది మౌన ప్రదర్శన



సామాజిక ఆరోగ్య కేంద్రంలో వేతనాలు సకాలంలో చెల్లించాలని మౌన ప్రదర్శన చేస్తున్న సిబ్బంది

గూడూరు, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గూడూరు సామాజిక ఆరోగ్యకేంద్రం ఎదుట శుక్రవారం మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ తమకు వేతనాలు ఏ తేదీన పడుతాయో తెలియక అయోమయానికి గురవుతున్నామన్నారు. వేతనాలు సకాలంలో అందక కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల 1వ తేదీన వేతనాలు ఇచ్చేలా కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది ఇందిరా, మంజుల, రాణి, సుజయ, ఖలీం, అరుణ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం టపాసుల దుకాణాలు నిర్వహించాలి

మహబూబాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం టపాసుల దుకాణాలను నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం దీపావళి పండుగ, సమాచార హక్కు చట్టం అమలుపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దుకాణదారులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, టపాసుల అమ్మకాలు జాగ్రత్తగా కొనసాగించాలని సూచించారు. దుకాణాల సముదాయంలో ఫైర్ సేఫ్టీ, విద్యుత్ సెఫ్టీ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. మునిసిపల్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ, సంబంధిత విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ప్రజలు టపాసులు కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. సమాచార హక్కు చట్టం-2005 అమలు వారోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ వారివారి విభాగాలకు చెందిన సమాచార దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తు దారులకు వేగంగా సమాచారం అందించాలని చెప్పారు. అనంతరం అధికారులతో సమాచార హక్కుచట్టంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, డీఎస్పీ తిరుపతిరావు, జిల్లా అధికారులు హరిప్రసాద్, రవిరాథోడ్, రాఘవరెడ్డి, టి.రాజేశ్వర్, మోహన్ రావు పాల్గొన్నారు.

గూడూరులో బీసీ సంఘాల రాస్తారోకో



గూడూరులో రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

గూడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : 42 శాతం బీసీల రిజర్వేషన్‌లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ గూడూరు మండల కేంద్రంలో శుక్రవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. నర్సంపేట-మహబూబాబాద్ జాతీయ రహదారిపై సుమారు గంటపాటు రాస్తారోకో జరగడంతో వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని నాయకులకు నచ్చజెప్పి, రాస్తారోకోను విరమింప చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలను అన్ని రంగాల్లో అణచివేతకు గురిచేస్తున్నారన్నారు. విద్యా, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ రంగాలలో జనాభా నిష్పత్తి ప్రకారం.. వనరులు రాకుండా అగ్రవర్ణాలు కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. బహుజనుల ఆత్మగౌరవంపై దాడి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్‌లను సాధించుకునేందుకు బీసీ కులాలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, నూకల సురేందర్, నామాని సదానందం, దేవేంద్రాచారి, రహీం, ఎదునూరి వెంకన్న, నాగరాజు, నూకల ఉపేందర్, వెంకటేశ్వర్లు, మేరెడ్డి సురేందర్, బత్తుల లక్ష్మణ్, పాపాని శ్రీనివాస్, మల్లయ్య, రాములు, బిక్షపతి, పోతరాజు రవి, అశోక్, వెంకన్న, వెంకటాచారి పాల్గొన్నారు.

దామోదర్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ



రాంరెడ్డి దామోదర్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో దివంగత మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుటుంబాన్ని శుక్రవారం మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి పరామర్శించారు. తుంగతుర్తిలో ఇటీవల మృతి చెందిన దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.కాంగ్రెస్ నాయకులు దేవరం ప్రకాశ్‌రెడ్డి, మాధవపెద్ది రమేష్ చందర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ పాల్గొన్నారు.



విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న దృశ్యం

పల్లెటూరి పిల్లల్లో ప్రతిభకు కొదవలేదు

• టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పల్లెటూరి పిల్లల్లో ప్రతిభకు కొదవలేదని టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా కేంద్రానికి చెందిన దాతలు శ్రీరంగం నాగరాజు, ఎస్వీ నాగేశ్వర్‌రావు 110 మంది విద్యార్థులకు టై, బెల్టులు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా మైస శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను సానబట్టి వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఈ పాఠశాల వాతావరణం, పిల్లల క్రమశిక్షణ, హాజరుశాతం చాలా బాగుందన్నారు. ఈ విధంగా ప్రభుత్వ పాఠశాలల ఉంటే విద్యార్థుల నమోదు శాతం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. దాతలు శ్రీరంగం నాగరాజు, ఎస్వీ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పల్లెటూరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఈ పాఠశాలకు తమవంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భద్రు, ఉపాధ్యాయులు వీరయ్య, జూలకంటి ప్రభాకర్, చాంప్లా, మౌనిక, సూర్యప్రకాష్, పవన్‌రాజ్, ఉపేందర్, సూర్యతేజ, శంకర్, శృతి పాల్గొన్నారు.

తల్లులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

కేసముద్రం, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన పిల్లల ఎదుగుదల కోసం వెయ్యి రోజుల పాటు తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీడీవో క్రాంతి సూచించారు. మండలంలోని ఉప్పరపల్లి రైతు వేదికలో శుక్రవారం పోషణ్‌మాసంలో భాగంగా పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దుర్గ, ఏఎన్ఎం రాణి, కార్యదర్శి రంజిత్, నాగార్జున, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు. బేరువాడలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ, కార్యదర్శి రఘువీర్, టీచర్లు బండారు అశోక, ఇ.పుష్పలత, కొమురమ్మ, రాజేశ్వరి, సరోజన, జయ పాల్గొన్నారు.



ఉప్పరపల్లిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎంపీడీవో క్రాంతి

కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా వీరస్వామి



మండల కేజీకేఎస్ అధ్యక్ష, కార్యదర్శులు పానుగంటి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ముంజాల వీరస్వామి

గూడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) మండల అధ్యక్షుడిగా గూడూరు మండల కేంద్రానికి చెందిన పానుగంటి వీరస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొలగాని వెంకటనర్సు, ఉపాధ్యక్షుడిగా పుల్లూరు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి ముంజాల వీరస్వామి, సహాయ కార్యదర్శిగా దూపటి కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా గొడిశాల వెంకన్న, గంధం వెంకన్న, వడ్లకొండ యాకయ్య, గోపగాని అశోక్, బెల్లంకొండ మధు, బిక్షపతి, తండ మల్లయ్య, సోషల్ మీడియా ఇంచార్జ్ పానుగంటి అజయ్, బొడ్డు సంతోష్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్నలు హాజరై కార్యవర్గాన్ని ప్రకటించారు.

‘వాళ్లకు బాకీకార్డులు చూపించండి’

ఇనుగుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులకు బాకీకార్డులు చూపాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, గ్రామపార్టీ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య, జాటోత్ హరిచంద్, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డోర్నకల్‌లో డీఆర్ఎం పర్యటన

(5వ పేజీ తరువాయి)

కలిసి ప్రారంభించారు. ఆస్పత్రి ప్రాంగణం మొత్తం కలియతిరిగిన తర్వాత డోర్నకల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు బషీర్‌అలీ డీఆర్ఎంను కలిసి రోడ్డు నెంబర్-11లో పాత్‌వే నిర్మించాలని, రన్నింగ్ స్టాఫ్‌కు క్వార్టర్స్ నిర్మించాలని కోరుతూ.. వినతిపత్రం అందించారు. ఆయన వెంట ఏడీఆర్ఎం రాజేందర్‌కుమార్, చీఫ్ మెడికల్ సూపరిండెంట్ నారాయణస్వామి, డోర్నకల్ రైల్వే వైద్యులు సునీల్‌కుమార్, సీనియర్ డీఓఎం సురేష్‌రెడ్డి, సీనియర్ డీఈఈ ప్రసాద్, డీసీఎం విశాల్‌అర్జున్, డోర్నకల్ ఐవో డబ్ల్యూ అఖిల్, సీనియర్ డీఎస్‌వో సురేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

● గార్ల : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో నెలకొన్న మౌళిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డోర్నకల్ విచ్చేసిన దక్షిణమధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణకు మండల ప్రముఖులు వినతిపత్రం అందజేశారు. ప్రయాణీకులకు తాగునీటి సౌకర్యం, ప్లాట్‌ఫాంపై డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు, శాతవాహన, గౌతమి, ఎక్స్‌ప్రెస్, రైళ్లను నిలుపుదల చేసి మణుగూర్ ప్యాసింజర్ పునరుద్ధరించాలని వినతి పేర్కొన్నారు. ఈ కార్యకరమంలో ఈశ్వర్ లింగం, రాధాకృష్ణ, శివాజీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

పొగాకు వినియోగం ప్రమాదకరం

(5వ పేజీ తరువాయి)

నాగేశ్వర్‌రావు, సారంగం, లక్ష్మీనారాయణ, శ్రావణ్‌కుమార్, ప్రత్యూష, విజయ్‌కుమార్, మాస్ మీడియా ఇన్‌చార్జి కొప్పు ప్రసాద్, కేవీ రాజు శారద, గీతా, అనిల్‌బాబు, రవిచందర్, ప్రవీణ్, సుష్మిత, ప్రశాంత్, రాకేష్, హరిబాబు, మానస పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీ..

జిల్లా కేంద్రంలోని నిఖ్యా ప్రైవేటు ఆస్పత్రిలో రవిరాథోడ్ ఆధ్వర్యంలో వైద్యబృందం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించి, ఆస్పత్రిలో జరుగుతున్న ఆపరేషన్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సీ సెక్షన్ ప్రసవాలు అధికంగా జరుగుతున్న తీరును వైద్య బృందం ఆరా తీసినట్లు తెలిపారు. డాక్టర్ శశిజ్యోత్స్న, సారంగం, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రాజు, అనిల్‌కుమార్, లోక్య పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం..

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో రవిరాథోడ్ మాట్లాడారు. ప్రతీ సంవత్సరం అక్టోబరు 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుతున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వం 2017లో మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం ద్వారా మానసిక సమస్యలు ఉన్న వ్యక్తుల హక్కులను రక్షిస్తూ వివక్షను తొలగించడం జరుగుతుందన్నారు. మానసిక ఆరోగ్యం కేవలం వైద్యుల బాధ్యత కాదని, సమాజం మొత్తం బాధ్యతగా భావించాలన్నారు. మానవుడు ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించుకోవచ్చన్నారు.